www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

మంగళ వారం
31-1-2023

సంపుటి - 07, సంచిక-245
పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole


**మహిళా క్రికెటర్లు దేశం గర్వించేలా చేశారు**

విమెన్ క్రికెటర్లకు రాష్ట్రపతి, ప్రధాని శుభాకాంక్షలు



4లో

# భారత్ జోడో యాత్ర



# లక్ష్యం నెరవేరింది

## ప్రజల సమస్యలను కళ్ళారా చూశాను

- జోడో యాత్ర ఎన్నో పాఠాలు నేర్పింది
- ముగింపు సభలో రాహుల్ ప్రసంగం



**శ్రీనగర్, జనవరి 30 (సమ సమాజం):** భారత్ జోడో యాత్ర లక్ష్యం నెరవేరిందని కాంగ్రెస్ నేతల రాహుల్ గాంధీ అన్నారు. జోడో యాత్ర ఊహించిన దానికంటే విజయవంతమైందన్నారు. అన్ని వర్గాల ప్రజల కష్టాలను దగ్గరుండి తెలుసుకున్నారు. ఓ దశలో యాత్ర కొనసాగిస్తానా అన్న భయం కూడా వేసిందన్నారు. అయితే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు మోడీ సర్కార్‌కు కనబడడం లేదన్నారు. జోడో యాత్ర నాకెన్నో పాఠాలు నేర్పిందన్నారు. భారత్ జోడో యాత్ర ముగిసింది. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సభను శ్రీనగర్‌లో నిర్వహించారు. అక్కడ తన సోదరి ప్రియాంకతో కలిసి మంచులో ఆటలాడుతూ రాహుల్ చాలా సందడిగా గడిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 145 రోజుల పాటు జోడో యాత్ర సాగిందన్నారు. ప్రజల సహకారం చూసి కన్నీళ్లు పెట్టుకున్నానని రాహుల్ పేర్కొన్నారు. ప్రజల సహకారం లేనిది ఏ పని ముందుకు సాగదన్నారు. కశ్మీర్ ప్రజలకు దేశమంతా అండగా ఉందన్నారు. కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా ఇస్తామని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ 7న రాహుల్ పాదయాత్ర కన్యాకుమారిలో ప్రారంభమైంది. సుమారు 5 నెలలపాటు 4 వేల కి.మీ మేర ఈ యాత్ర కొనసాగింది. ఇక జనవరి 30న కశ్మీర్‌లో ముగింపు సభ జరిగింది. 'మిలే కదం.. జుడే వతన్ అనే నినాదంతో ఈ యాత్ర ప్రారంభమైంది. 12 రాష్ట్రాల్లో రాహుల్ యాత్ర సాగింది. అడుగడునా రాహుల్‌కు ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. కశ్మీర్‌లోని లాల్‌చౌక్‌లో జాతీయ జెండా ఎగురవేయడంతో ఈ యాత్రకు ముగింపు పలికినట్లయ్యింది.

3లో

# జాతిపితకు ఘనంగా నివాళి



రాజ్‌ఘాట్ వద్ద నివాళులు ● బాపూఘాట్ వద్ద గవర్నర్, మంత్రుల నివాళి

**న్యూఢిల్లీ, జనవరి 30 (సమ సమాజం):** అమరవీరుల దినోత్సవం సందర్భంగా మహాత్మాగాంధీకి ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. జాతి సేవలో భాగంగా తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన వీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ రోజు గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నానని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. దేశం కోసం అమరులైన వారందరికీ కూడా తాను నివాళులర్పిస్తున్నానని చెప్పారు. వారి త్యాగాలు ఎప్పటికీ మరువలేనివన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం కోసం పని చేయాలనే తమ సంకల్పాన్ని బలోపేతం చేస్తూనే ఉంటాయని ట్వీట్ లో పేర్కొన్నారు. స్వదేశీ, స్వావలంబన మార్గాన్ని

3లో

# నీటిరంగంలో విప్లవం సాధించాం

## నాలుగేండ్లలోనే కాళేశ్వరం పూర్తి చేశాం

- ఇంటింటికీ మంచినీరు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- ఐటీసీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను ప్రారంభించిన కెటీఆర్

**మెదక్, జనవరి 30 (సమ సమాజం):** నీళ్లిస్తే అద్భుతాలు చేస్తామని మన రైతులు నిరూపించారని మంత్రి కేటీఆర్ అన్నారు. స్వల్ప సమయంలో తెలంగాణ ప్రగతి సాధించిందని వెల్లడించారు. నీటి వనరుల్లో విప్లవం సాధించామని చెప్పారు. నీటి వనరుల్లో విప్లవం సాధించామని మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరాన్ని నాలుగేండ్లలోనే పూర్తి చేశామన్నారు. 10 టీఎంసీల కాళేశ్వరం నీటిని పరిశ్రమలకు అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఇంటింటికీ మంచినీళ్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ



3లో

# గవర్నర్ విషయంలో వెనక్కి తగ్గిన ప్రభుత్వం







- బడ్జెట్‌పై వేసిన పిటిషన్ వెనక్కి తీసుకున్న సర్కార్
- గవర్నర్ బడ్జెట్ ప్రసంగం ఉంటుందని హైకోర్టుకు వెల్లడి
- గవర్నర్‌ను విమర్శించకుండా చూస్తామని వెల్లడి

**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** గవర్నర్‌తో పోరు కీలక మలుపు తిరిగింది. గవ్నర్ వ్యవస్థను దునుమాడుతూ వచ్చిన కెసిఆర్ సర్కార్ ఇప్పుడు రాజ్యాంగానికి తలొగ్గారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గవర్నర్ బడ్జెట్ ఆమోదించడం లేదంటూ హైకోర్ట్ లో వేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను అనూహ్యంగా వెనక్కి తీసుకున్నారు. అంతేగాకుండా బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉంటుందని ప్రభుత్వం తరపు న్యాయవాది దుష్యంత్ ధవే హైకోర్టుకు తెలిపారు. గవర్నర్ ప్రసంగంతోనే సమావేశాలు ప్రారంభ మవుతాయన్నారు. గవర్నర్ ను విమర్శించొద్దని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.. గవర్నర్ కూడా తన రాజ్యాంగ బద్ధమైన విధులు నిర్వహిస్తారని గవర్నర్ తరపు లాయర్ కోర్టుకు తెలిపారు. బడ్జెట్ ఆమోదంపై గవర్నర్ తమిళి సై అనుమతి తెలపకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. లంచ్ మోషన్ కు అనుమతించాలని అడ్వకేట్ జనరల్ హైకోర్టును కోరారు. 'లంచ్ మోషన్' మెన్షన్ చేసిన సందర్భంలో న్యాయస్థానం కీలక వాఖ్య చేసింది. 'ఇందులో న్యాయ వ్యవస్థ ఎలా జోక్యం చేసుకుంటుంది' అని వ్యాఖ్యానించింది. లంచ్ మోషన్ అనుమతిస్తే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అడ్వకేట్ జనరల్

3లో

# 3న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం

- 6న బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం
- తాజా పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వ యోచన
- అసెంబ్లీ సమావేశాల ఖరారుపై ప్రభుత్వం కసరత్తు

**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** తాజా పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మార్పు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. వాస్తానికి ఫిబ్రవరి 3న బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించినా ప్రస్తుతం షెడ్యూల్ మారే అవకాశాలు



3లో

# పెషావర్‌లో ఆత్మహుతి దాడి

- మసీదులో పేల్చుకున్న బాంబర్
- 28 మంది మృతి..150మందికి గాయాలు



**ఇస్లామాబాద్, జనవరి 30 (సమ సమాజం):** పాకిస్థాన్‌లోని పెషావర్‌లో భారీ పేలుడు జరిగింది. ఓ మసీదులో ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడిలో ఇప్పటివరకు 28 మంది మృతి చెందారు. 150 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో 25 మంది పోలీసులు కూడా ఉన్నట్లు తెలిసింది. స్థానికంగా ఉన్న మసీదులో ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. అదే సమయంలో మసీదు ప్రాంతంలో భారీ పేలుడు జరగడంతో సమీపంలోని ఓ భవనంలోని ఒక భాగం కూలిపోయింది. చాలామంది ఈ శకలాల కింద చిక్కుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

3లో

# పని చేసిన జిల్లాలోనే మాజీ కలెక్టర్ అరెస్ట్

- పేదలకు డబుల్ ఇళ్ల కోసం ఆకునూరి మురళి ఆందోళన
- అరెస్ట్ చేసిన భూపాలపల్లి పోలీసులు

**భూపాలపల్లి, జనవరి 30 (సమ సమాజం):** తాను కలెక్టర్గ్ఆ పనిచేసిన జిల్లాలోప రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళిని భూపాలపల్లి పోలీసులు అరెస్టు చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తాను ఐదు



2లో

# సంపాదకీయం

## ఆదానీ గ్రూపు ప్రకంపనలపై మోడీ మౌనమేల !

ఆదానీ,అంబానీలకే ప్రభుత్వం..అంటే మోడీ సాయం చేస్తున్నారన్న విమర్శలు దేశ వ్యాప్తంగా వస్తున్న వేళ హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు అత్యంత కుబేరుడైనా గౌతం అదానీ సంపద కీలకమైన 100 బిలియన్ల మార్క్‌కు దిగువకు పడిపోయింది. దీనిపై సిబిఐ, సెబి విచారణలు జరపాలన్న విపక్షాల డిమాండ్ పెరిగింది. పార్లమెంట్ సమావేశాలు జరుగబతున్న వేళ దీనిపై ప్రకంపనలు తప్పేలా లేవు. ప్రభుత్వం కూడా దీనిపై సమగ్ర విచారణ జరిపి మదుపర్లకు అండగా నిలవాలి. ప్రభుత్వం ముఖ్యంగా మోడీ ఈ అంవంపై జోక్యం చేసుకోవాలి. తన నిజాయితీని చాటుకుని..ఈ మోసాలపై దర్యాప్తునకు పూనుకోవాలి. ఇలాంటి మోసాలు నిజమే అయితే కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. అలాగే ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే. ఇకపోతే ఎల్‌ఐసి లాంటి సంస్థల పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే మంచిది. ఇకపోతే రెండు రోజుల్లో ఆయన కంపెనీల షేర్ల పతనంతో ప్రపంచ సంపన్నుల జాబితాలో అదానీ ర్యాంకింగ్ ఏడో స్థానానికి పడిపోయింది. ఇంతక్రితం ఆయన నాలుగో స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ తాజా ప్రకంపనలతో దిగజారిపోయారు. ఈ క్రమంలో ఎల్‌ఐసి లాంటి సంస్థలు ఆదానీలో పెట్టిన పెట్టుబడులకు ముప్పు ఏర్పడింది. కొన్ని నెలల క్రితం ఓ దశలో ఆదానీ గ్రూపు రెండో స్థానానికి ఎగబాకగా.. చాలా కాలం మూడో స్థానంలో కొనసాగారు. ఇందులో నిజానిజాలు చర్చించాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న వేళ ఆదానీ వ్యవహారం పార్లమెంట్‌ను కుదిపేయ నుంది. ప్రస్తుతం హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బ కారణంగా స్టాక్ మార్కెట్లో అదాని గ్రూపు ప్రకంపనలు కొనసాగుతున్నాయి. అదాని సంస్థ మోసపూరిత చర్యలకు పాల్పడుతోందని, మనీ లాండరింగ్ చేస్తోంటూ అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఇచ్చిన పరిశోధనాత్మక నివేదికతో భారత మార్కెట్లు విలవిలలాడుతున్నాయి. రెండు రోజుల్లో 10.65 లక్షల కోట్ల రూపాయల సంపదను ముదుపర్లు కోల్పోయారు. అదానీకి చెందిన 10 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4 లక్షల కోట్లు ఆవిరయింది. శుక్రవారం ఒక్కరోజే ఈ సంస్థలు మూడు లక్షల కోట్ల రూపాయల మేర నష్టం చవిచూశాయి. జనవరి 24న అదానీ గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ విలువ రూ19 లక్షల కోట్లుగా ఉండగా.. జనవరి 27 ముగింపు నాటికి రూ.15 లక్షల కోట్లకు పరిమిత మయ్యింది. అదానీ షేర్లలో అమ్మకాల వల్ల ఎల్‌ఐసి దాదాపు రూ.18వేల కోట్ల నష్టాన్ని చవి చూసింది. అదానీ గ్రూపులోని కంపెనీల్లో జనవరి 24 నాటికి ఎల్‌ఐసి పెట్టుబడి రూ.81,268 కోట్లుగా ఉండగా.. 27 నాటికి ఇది రూ.62,621 కోట్లకు పడిపోయింది. ఇంత భారీ నష్టం జరిగినా ఎల్‌ఐసి నుండి మరో 300 కోట్ల రూపాయలను అదాని గ్రూపు నకు మళ్లించదానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అదాని ఎంటర్‌ప్రైజెస్ కొత్తగా విడుదల చేయనున్న ఎఫ్‌పిఓలో ఎల్‌ఐసి ఈ మేరకు పెట్టుబడులు పెట్టనుందని సమాచారం. దీంతో అదాని గ్రూపులో ఎల్‌ఐసి పెట్టుబడు లు మరో 4.23శాతం మేర పెరగనున్నాయి. దీనిపై విపక్షాలు యుద్దానికి సిద్ధం అవుతున్నాయి.సంక్షోభం వేళ ఈ స్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి ప్రభుత్వ రంగ సంస్థయైన ఎల్‌ఐసి సిద్ధపడటం వెనుక ప్రభుత్వ వర్గాల ఒత్తిడి ఉందని భావిస్తున్నారు. ఇకపోతే గౌతం అదానీకి చెందిన అదానీ గ్రూపు తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని.. ఎకౌంట్స్‌లోనూ మోసాలు చేస్తోందని తాము ఇచ్చిన రిపోర్టుల కు కట్టుబడి ఉన్నామని అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ స్పష్టం చేసింది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుందని, షేర్ల ధరలను కృత్రిమంగా పెంచిందని ఆ సంస్థ ఆరోపించింది. పన్ను ఎగవేత, మనీలాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. కార్పొరేట్ ప్రపంచ చరిత్రలో ఇదో

అతిపెద్ద కుట్ర అంటూ నివేదకలో తెలియచేసింది. గత మూడేళ్లలోనే తన గ్రూప్‌నకు చెందిన 7 ప్రధాన లిస్టెడ్ కంపెనీల ముఖ విలువను ఎక్కువ చేసి, షేర్ల విలువను కత్రిమంగా పెంచి ఆదానీ మోసానికి పాల్పడ్డారు. నష్టాలతో ట్రేడ్ అవుతున్న ఆ కంపెనీల వాటాలను తనఖా పెట్టి అదానీ గ్రూప్ భారీగా రుణాలను పొందింది. దీంతో అదానీ కంపెనీ వాటాదార్ల సొమ్మును, గ్రూప్ ఆర్థిక పరిస్థితిని ప్రమాదంలో పడేసినట్టే. అదానీ గ్రూప్ మనీలాండరింగ్, అవినీతి ఆరోపణలకు గానూ భారీగా డబ్బు వెచ్చించింది. రూ.1.4 లక్షల కోట్ల అవినీతి, మనీలాండరింగ్, పన్ను ఎగవేతకు సంబంధించి అదానీ గ్రూప్ ఇప్పటికే నాలుగు కేసుల్లో ప్రభుత్వ సంస్థల విచారణను ఎదుర్కొంటుందని ఈ రిపోర్టు తెలిపింది. తమ సంస్థపై ద్వేషంతో ఆధారాలు లేకుండా హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిందని అదానీ గ్రూపు స్టాక్ ఎక్స్ఛేంజీలు, రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. హిండెన్‌బర్గ్ రిపోర్టును తప్పు బట్టింది. దీనిపై హిండెన్‌బర్గ్ కూడా ఘాటుగానే స్పందించింది. తాము ఇచ్చిన రిపోర్టు సరైనదని.. లేకపోతే ఆ కంపెనీ చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అదానీ గ్రూపు చేతనైతే తమపై కోర్టుకెళ్లాలని సవాలు విసిరింది. తమ సంస్థ అమెరికా నుంచి పనిచేస్తోందని.. కాబట్టి అక్కడ దావా వేసుకోవచ్చని సూచించింది. ఒకవేళ ఈ విషయంలో అదానీ గ్రూప్ కనుక విఫలమైతే తమ వాదనలు సరైనవిగా భావించాల్సి వస్తుందని కూడా సవాల్ విసిరింది. అదానీ గ్రూపులో గతంలో పనిచేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, వేలాది పత్రాలు, ప్రభుత్వ, అంతర్జాతీయ సంస్థల నిఘా నివేదికలు, అదానీ గ్రూపు కంపెనీల శాఖలు ఉన్న 12కు పైగా దేశాలను పర్యటించి ఈ నివేదికను తయారు చేసినట్టు హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తెలిపింది. తాము విడుదల చేసిన రిపోర్టులోని ఒక్క అంశాన్ని కూడా అదానీ గ్రూపు స్పష్టంగా లేవనెత్తలేకపోయింది. మేము సూటిగా 88 ప్రశ్నలు వేశామని, ఇందులో అదానీ గ్రూపు ఏ ఒక్క ప్రశ్నకు ఇప్పటికీ బదులు ఇవ్వలేకపోయిందని పేర్కొంది. హిడెన్‌బర్గ్ రిపోర్టులోని ప్రధానాంశాలు గమనిస్తే..అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుందన్నది ప్రధాన ఆరోపణ.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# సమగ్ర పంటల విధానం రావాలి

ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ఉండాలి ● సొంత వ్యవసాయ విధానాలు తయారు చేయాలి

**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** ఏయేటి కాయేడు పంటల కొనుగోళ్ల సమయంలో ఆందోళనలు సర్వసాధారణంగా మారాయి. కేంద్రంతో సంబంధం లేకుండా వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, పంటలను కొనుగోళ్లు చుయడం వంటి విషయాల్లో రాష్ట్రాలు ముందుకు కదలడం లేదు. ప్రభుత్వాలకు చిత్తశుద్ది లేకపోవడం ఇతరత్రా ప్రయోజనాలను ఆశించడం వల్ల ఈ విషయంలో ప్రణాళిక లేకుండా సాగుతున్నారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో వ్యవసాయంలో పురోగతి సాధించవచ్చు. కేంద్రాన్ని తిడుతూ కూర్చునే కన్నా కార్యాచరణ చేసి విజయం సాధించవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో అనేక అవకాశాలు , వనరులు ఉన్నా పటిష్టమైన వ్యవసాయ విధానాలు అవలంబించడం లేదు.. దీనికితోడు తాము అమలు చేస్తున్న విధానాలనే ఉత్తమమైనవిగా ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో పంటలు పండించే రైతులకు గిట్టుబాటు కావడం లేదు. కొనుగోళ్లు చేసే ప్రజలకు భారం అవుతోంది. రైతులకు, ప్రజలకు మధ్యఅనుసంధానంగా ఉంటూ పంటల ప్రణాళిక, వ్యవసాయ విధానాలు రూపొందితే అన్నదాతలకు, ప్రజలకు మేలు జరగగలదు. తెలంగాణలో నీటి లభ్యత పెరిగింది. ఉచిత కరెంట్ ఇస్తున్నారు. కానీ పండిన పంటలను సకాలంలో కొనుగోలు చేసే యంత్రాంగాన్ని నిర్మించలేకపోయారు. పెట్టుబడి కింద ఎకరానికి ఏటా ఇస్తున్న డబ్బులు వృధా అవతున్న విషయం ప్రభుత్వానికి తెలుసు. అయినా దానిని సమీక్షించడం లేదు. పారంబోకు భూములకు, తోటలకు ,డబ్బున్న వాళ్లకు కూడా ప్రభుత్వం నుంచి రైతుబంధు సొమ్ము అందుతోంది. ఈ వృధాను అరికట్టడంలో కెసిఆర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో చెల్లిస్తున్న ధనాన్ని పంచడం ఎంతవరకు భావ్యమో ఆలోచించడం లేదు. ఆ డబ్బును పంటల కొనుగోళ్లకు వినియోగించి..రైతులను ఆదుకోవచ్చు. వారికి మద్దతు ధరలను మించి ధరలు చెల్లించవచ్చు. అలాగే ఆ పంటను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పి ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావచ్చు. కానీ లేనిదల్లా చిత్తశుద్ది మాత్రమే. తమది రైతు ప్రభుత్వమని సిఎం కెసిఆర్ మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు ఢంకా బజాయిస్తునా ఏటా సరిగా పంటలు కొనుగోళ్లు చేయలేని దుస్థితలో ప్రభుత్వం ఉంది. రాష్ట్రంలో ప్రధానంగా సాగయ్యే కందిపంట కొనుగోళ్ల సీజన్ వచ్చినా సరైన ప్రణాళిక ఉండడం లేదు. పంట చేతికొచ్చి పక్షంరోజులు గడిచిపోతున్నా కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. దీనికితోడు పండించిన పంట ఏదైనా మద్దతు ధరలు లేక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే చేతికొచ్చిన కంది పంటను ఇంట్లోనే నిల్వ చేసుకుంటున్న రైతులు కొనుగోళ్ల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ప్రభుత్వ నిర్ణయంతో సొసైటీల ఆదాయానికి గండిపడే అవకాశం ఉంది. ఇన్నాళ్లు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘాల ద్వారా కందులను కొనుగోలు చేసేవారు. ఇకపోతే పసుపు రైతులదీ ఇదే కష్టం. వారికి కూడా ధరలు రావడం లేదు. గతంలో బాబా రాందేవ్‌బాబను తీసుకుని వచ్చి హడావిడి చేసిన ఆనాటి ఎంపి కవిత ఇప్పుడు చేతులు దుపులుకుని, ఎంపి ధర్మపురి అర్వింద్‌ను దుమ్మెత్తి సోయడంతో.. దీనిచుట్టూ రాజకీయాలు తిరుగు తున్నాయి. నిజామాబాద్ జిల్లాలో పసుపును సాగు చేసే రైతులకు నష్టాలే తప్ప లాభాలు రావడంలేదు. ఎకరం సాగు చేయడానికి రైతులు రూ.లక్షా 20వేల నుంచి రూ.లక్షా 50వేల వరకు ఖర్చు చేస్తున్నారు. పసుపు సగటు దిగుబడి 20 క్వింటాళ్లు వస్తోంది. ప్రస్తుతం క్వింటా పసుపు ధర సుమారు రూ.5వేలు మాత్రమే ఉంది. ఈ ధరతో రైతులకు పెట్టుబడులు కూడా మిగలడం లేదు. పసుపు సాగు చేసినందుకు నష్టాలనే మూటగట్టు కుంటున్నారు. అన్ని పంటలకు మద్దతు ధరలు, పంటల పెట్టుబడుల ధరలు పెరిగినా పసుపు ధర మాత్రం పెరగడం లేదు. ఇది పసుపు రైతు దీన పరిస్థితికి అద్దం పడుతోంది. పసుపు మద్దతు ధరల జాబితాలో లేనందునే ఈ పరిస్థితి ఏర్పడింది.పసుపునకు మద్దతు ధర ఉంటే ఇంత దారుణమైన స్థితి ఉండదు. పంటలకు ధర లేనప్పుడు ప్రభుత్వాలు ఎంఐఎస్ కింద కొనుగోలు చేసే వీలుంది. కానీ ప్రభుత్వాలు కొనుగోలుకు ముందుకు రావడంలేదు. బహిరంగా మార్కెట్‌లో వ్యాపారులు ఇంత కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు. బయట డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులే ధర పెంచడం లేదు. తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి లాభాలు ఆర్జిస్తున్నారు. ఆరుగాలం చెమటోడ్చి పంట పండించిన రైతులకు నష్టాలు వస్తే, కూర్చున్న దగ్గర వ్యాపారులకు పెద్ద మొత్తంలో లాభాలు రావడం గమనార్హం. సమగ్ర వ్యవసాయ విధానాలు అవలంబించి ఉంటే ఏపం వేయాలో..ఏ పంటను ఎప్పుడు కొనుగోలు చేయాలో..ప్రజలకు వాటిని ఎలా సరఫరా చేయాలో అవగాహన ఉండేది. ప్రజలకు రైతులకు వారధిగా ప్రభుత్వాలు పనిచేయనంత కాలం దళారులే లాభపడతారని గుర్తించాలి.

# పని చేసిన జిల్లాలోనే మాజీ కలెక్టర్ అరెస్ట్



(మొదటి పేజీ తరువాయి) సంవత్సరాల క్రితం కలెక్టర్‌గా పని చేసిన సమయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్దిదారులకు కేటాయించాలంటూ ఆయన లబ్దిదారులతో కలిసి ఆందోళన చేపట్టారు. 960 ఇళ్లను వెంటనే లబ్దిదారులకు ఇవ్వాలంటూ ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు మురళిని బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లోనూ ఆకునూరి మురళీ ఆందోళన కొనసాగించారు. మురళికి మద్దతుగా డబుల్ బెడ్ రూం లబ్దిదారులు, మహిళలు స్టేషన్‌కు తరలివచ్చారు. లబ్దిదారులకు ఇళ్లు కేటాయించే వరకు తాను ఆందోళన విరమించే ప్రసక్తి లేదని ఆకునూరు భీష్మించుకుని కూర్చోవటంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావారణం నెలకొంది. తెలంగాణ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదని గత కొంత కాలంగా ఆకునూరి మురళి తన నిరసన గళం వినిపిస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ నిత్యం ఏదో ఒక సమస్యపై ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో డబుల్ బెడ్ రూం ఇళ్లను నిరుపేదలకు ఇవ్వాలని పోరాటం మొదలు పెట్టారు. ఇదే విషయమై పలుమార్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం కూడా ఇచ్చారు. ఇళ్లు నిర్మించి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా.. పేదలకు కేటాయించటం లేదని ఆందోళన బాటపట్టారు. ఈ క్రమంలో భూపలపల్లిలో సోమవారం ఆందోళన చేపట్టగా.. పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

# తెలంగాణను సొంత జాగీర్‌లా పాలిస్తున్నారు

గవర్నర్‌ను అడుగడుగునా అవమానించే చర్యలు

కెసిఆర్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్





**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** కేసీఆర్ కుటుంబం తెలంగాణకు రాజు లాగా వ్యవహరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ ఆరోపించారు. రాష్ట్ర గవర్నర్‌ను బద్నాం చేస్తున్నారని.. అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్‌ను పిలిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బందేంటని ఆయన ప్రశ్నించారు. గవర్నర్ విషయంలో హైకోర్టు అనేకసార్లు మొట్టికాయలు వేసినా కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అలాగే వ్యవహరిస్తోందని అన్నారు. అసెంబ్లీ సమావేశాలకు సమయం ఉన్నప్పటికీ.. కావాలనే కోర్టుకు వెళ్లిందని ప్రభుత్వం పై మండిపడ్డారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల ఫైల్ ఎంతవరకు వచ్చిందో శాసనసభ స్పీకర్ చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు ఎన్నో ఉన్నాయని వాటిని పక్కనపెట్టి.. కేసీఆర్ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని బండి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కార్ తీరుతో తెలంగాణలో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బండి సంజయ్ అన్నారు. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. స్టీల్ ఫ్యాక్టరీ డీపీఆర్ ఇవ్వటం లేదని కేంద్రమే స్వయంగా చెబుతోందన్నారు. మరోవైపు ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు తప్పులు తడకగా ఉన్నాయని విమర్శించారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఇప్పుడు ప్రభుత్వం ఏమని సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నందునే ఎంపీ అర్వింద్ పై ప్రభుత్వం కక్ష కట్టిందని బండి ఆరోపించారు. బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాష్ పై పోలీసులే విచక్షణారహితంగా దాడి చేశారని బండి సంజయ్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటోందన్న బండి సంజయ్.. ఎస్, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల కోసం బీజేపీ చాలా కాలం నుంచి ఉద్యమం చేస్తోందని చెప్పారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డీజీపీ ఆఫీసుకు వెళ్తే బీజేపీ కార్యకర్తలపై పోలీసులు విచక్షణ రహితంగా దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో పోలీసుల దాడులు చాలా ఎక్కువయ్యాయని విమర్శించారు. పోలీసుల దాడిలో గాయాలపాలైన భానుప్రసాద్ కు ఆస్పత్రిలో రెండు రోజుల నుంచి ట్రీట్ మెంట్ జరుగుతోందని, ముఖ్యమంత్రి మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని ÷ర్ అయ్యారు బండి సంజయ్.. దేశంలో ఆర్మీ రిక్రూట్ మెంట్ కంటే ఎక్కువగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికలో కండిషన్స్ ఉన్నాయి. ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షలో 20 ప్రశ్నలు తప్పుగా ఉన్నాయి. తప్పులు చేసింది కేసీఆర్, అందుకు 2 లక్షల మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు రోడ్డున పడ్డారు. కేసీఆర్ ఎవరికి అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదు. మంత్రులందరూ రబ్బరు స్టాంపులుగా మారారు. కేసీఆర్ నిజాం రాజులా ప్రవర్తిస్తున్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలి. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి. బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ గురించి కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటివరకు డీపీఆర్ ఇవ్వలేదన్న బండి సంజయ్.. ఎక్కడ ఏర్పాటు చెయ్యాలో కూడా చెప్పలేదన్నారు. నిజామాబాద్ కలెక్టరేట్ లో సర్పంచ్ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని, సర్పంచుల నిధులన్నీ కేసీఆర్ దోచుకున్నారని తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. కేసీఆర్ కు దమ్ముంటే రాష్ట్ర అభివృద్ధి గురించి చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం

జంతర్‌మంతర్ వద్ద ధర్నాలో కోదండరామ్



న్యూఢిల్లీ,జనవరి30(సమ సమాజం):కృష్ణా జలాల్లో రాష్ట్రానికి సరైన న్యాయం జరగడంలేదని కోదండరాం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న జలవనరుల దోపిడీని అరికట్టాలన్నారు. రాష్ట్రం ఏర్పడి 8 ఏళ్లైనా నీటి వాటాలు తేల్చకపోవడం దురదృష్టకరమన్నారు. ట్రిబ్యునల్ వేసి రాష్ట్ర వాటా తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కోదండరాం మౌన దీక్ష చేశారు. విభజన హామీలు, కృష్ణానదీ జలాల సమస్యపై 150 మందితో గంటపాటు ఈ దీక్ష సాగించారు. కృష్ణా తీర ప్రాంతం 78శాతం తెలంగాణలో ఉందని.. కానీ రాష్ట్రానికి 299 టీఎంసీలు మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుతం తెలంగాణలో వరద జలాలపై ఆధారపడి ప్రాజెక్టులు నడుస్తున్నాయన్నారు.ప్రాజెక్టులకు కేంద్రం పర్మిషన్ ఇవ్వకపోవడం వల్ల 28 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఆగిపోయిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందన్నారు. బీఆర్ఎస్ ఆంధ్రాలో కూడా పోటీ చేస్తుంది కాబట్టి రాష్ట్ర సమస్యలపై పోరాటం చేయడంలేదని విమర్శించారు. మంగళవారం ఢిల్లీలోని కాన్సిట్యూషన్ క్లబ్ లో కేసీఆర్ పాలనపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. విభజన చట్టంలోన10వ షెడ్యూల్ లో కీలక అంశాలు ఉన్నాయని.. 9 ఏళ్లుగా వాటిపై దృష్టి పెట్టలేదని కోదండరాం విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, పారిశ్రామిక రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం అడగకపోవడంతో కేంద్రం పట్టించుకోలేదన్నారు. రెండు రాష్ట్రాల అభివృద్ధి కోసం ఉద్దేశించిన ఏ అంశం

# ఫిబ్రవరి 2నుంచి సమతా కుంభ్

పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు

పద్మభూషణ్ రావడం ఆనందదాయకం

మీడియాతో చినజీయర్ స్వామి



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** తన మేధస్సుతో ఎన్నో సంస్కరణ తీసుకొచ్చిన ఘనుడు రామానుజా చార్యులు అని చిన్నజీయర్ స్వామి అన్నారు.సోమవారం మీడియాతో మాట్లాడుతూ రామానుజచార్య మహామూర్తిని ఆవిష్కరించుకుని సంవత్సరం అవుతుందని చిన్నజీయర్ స్వామి పేర్కొన్నారు. ఫిబ్రవరి 2వ తేదిన సమతా మూర్తి మొదటి వార్షికోత్సవం మొదలు కాబోతుందని ఆయన తెలిపారు. ప్రతి ఏడాది సమతా కుంభ్ పేరుతో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అన్నారు.హరిజనులు, దళితులకు సైతం ఆలయాల్లో సేవ చేసు అవకాశానికి కారణం రామానుజాచార్యులని చిన్నజియర్ అన్నారు. ఫిబ్రవరి 2 నుంచి 12 వరకు శ్రీ రామానుజాచార్య 108 దివ్య దేశాల బ్రహ్మోత్సవాలు, ముచ్చింతల్ లోని శ్రీ రామనగరంలో 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పద్మభూషణ్ అవార్డు కోసం మీ పేరు సూచిస్తున్నారు మీకు ఏమైన అభ్యంతరమా అని అడిగాగా తనకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. పద్మభూషణ్ అవార్డు నేను కోరలేదు కానీ రావడం పట్ల సంతోషంగా ఉందని చిన్నజియర్ స్వామి అన్నారు. ప్రతి రాజకీయ పార్టీకి ఏదో ఒక సిద్దాంతం ఉంటుందని.. దానికి అనుకూలంగానే పరిపాలన ఉంటుందని చినజీయర్ స్వామి అన్నారు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా ప్రజల రక్షణ కోసమే పరిపాలన సాగిస్తారని చెప్పారు. ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఎన్నికల తర్వాత రాజకీయాలు చేయడం ఆపేసి.. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తాయని.. కాని ప్రస్తుతం రాష్ట్రంలో అలాంటి వాతావరణం కనిపించడం లేదన్నారు. రాజకీయ పార్టీల నేతలు ప్రజల సమస్యలపై కాకుండా.. ఒకరిని ఒకరు దూషించుకోవడం పై ఎక్కువ ఫోకస్ పెడుతున్నారని చినజీయర్ చెప్పారు. కేవలం ప్రజా సంక్షేమం కోసమే అన్ని రాజకీయ పార్టీలు పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. సమతా స్ఫూర్తి కేంద్రానికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సమతా కుంభ్ పేరుతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని చిన్న జీయర్ స్వామి తెలిపారు.

# కొనసాగుతున్న లోకేశ్ పాదయాత్ర




నాలుగోరోజు పలమనేరు నుంచి ప్రారంభం

కర్నాటకలో పెట్రో రేట్లు తక్కువన్న లోకేశ్

ఎపిలో దోపిడీకి ఈ రేట్లే నిదర్శనమని విమర్శలు

**కుప్పం, జనవరి 30 (సమ సమాజం):** టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్ర నాలుగో రోజు కొనసాగుతోంది. సోమవారం ఉదయం కర్ణాటక రాష్ట్రం పంతాన్ హల్లికి పాదయాత్ర చేరుకుంది. లోకేష్ పాదయాత్రకు కర్ణాటక పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. పంతాన్ హల్లి పెట్రోల్ బంక్‌లో ఆగిన టీడీపీ నేత... తన కాన్వాయ్ వాహనాలకు దగ్గరుండి డీజిల్ కొట్టించారు. అనంతరం తానే స్వయంగా డబ్బులు ఇచ్చి ఏపీలో ఉన్న రేట్లకి కర్ణాటకలో ఉన్న పెట్రోల్, డీజిల్ రేట్లకి ఉన్న తేడాను తెలుసుకున్నారు. పెట్రోల్, డీజిల్‌పై జగన్ రెడ్డి బాదుడే బాదుడు అని లోకేష్ మండిపడ్డారు. కర్ణాటకలో లీటర్ డీజిల్ రూ.88, పెట్రోల్ రూ.102 అని... ఏపీలో లీటర్ డీజిల్ రూ.99.27, రూ.పెట్రోల్ 111.50లుగా ఉందని... అంటే జగన్ రెడ్డి బాదుడు 10 రూపాయిలు అని చెప్పుకొచ్చారు. తనతో నడుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు రేట్ల తేడా గురించి వివరించారు. దేశం మొత్తంలో ఏపీలోనే ఎక్కువ రేట్లు ఉన్నాయంటూ పన్నుల భారం గురించి ప్రజలు, కార్యకర్తలకు లోకేష్ వివరించారు. లోకేష్ యువగళం పాదయాత్ర నాలుగో రోజు పలమనేరు నియోజకవర్గం నుంచి ప్రారంభమైంది. ఇదిలావుంటే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర లో ఏపీ-కర్నాటక సరిహద్దులో ఓ అసక్తికరమైన ఘటన చోటు చేసుకుంది. పాదయాత్రలో కర్నాటక పరిధిలో వచ్చిన రోడ్లపై ఆ రాష్ట్ర పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. సరిహద్దు దాటి తిరిగి ఏపీలోకి అడుగుపెట్టేలోపు లోకేష్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీడీపీ నేతలు కర్నాటక పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ సరిహద్దులో లోకేష్ పాదయాత్రకు కర్నాటక పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాళ్లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# తారకరత్నకు పలురకాల పరీక్షలు



వైద్యుల పర్యవేక్షణలో కొనసాగుతున్న చికిత్స

నిలకడగానే ఉందని వెల్లడించిన రామకృష్ణ

**బెంగళూరు, జనవరి 30 (సమ సమాజం):** సినీ నటుడు నందమూరి తారకరత్న ఆరోగ్య పరిస్థితిపై కీలక అప్డేట్ వచ్చింది. తారకరత్న ఆరోగ్యంపై ఆయన బాబాయ్.. నందమూరి రామకృష్ణస్పందించారు. సోమవారం మధ్యాహ్నం తారకరత్నను ఐసీయూలో చూసి బయటికొచ్చిన ఆయన మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించారు. తారక్ ఆరోగ్యం నిన్న, మొన్నటితో పోలిస్తే కాస్త మెరుగుపడిందని రామకృష్ణ తెలిపారు. అవయవాలన్నీ చికిత్సకు స్పందిస్తున్నాయని చెప్పారు. అయితే ఇంకా వెంటిలేటర్‌పైనే ఉన్నారన్నారు. తారకత్నకు ఎక్మో పెట్టారన్న వార్తలపై రామకృష్ణ రామకృష్ణ చెప్పిన ఈ ఒక్క మాట నందమూరి, నారా ఫ్యామిలీ, అభిమానులు , టీడీపీ కార్యకర్తలకు కాస్త ఉపశమనం కలిగించేదని చెప్పుకోవచ్చు. సిటీ స్కాన్ రిపోర్ట్ వచ్చాక బ్రెయిన్ పనితీరుపై క్లారిటీ వస్తుందని రామకృష్ణ చెప్పారు. ఐసీయూలో న్యూరాలజిస్టుల పర్యవేక్షణ మధ్య తారకరత్న వైద్యం తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. సోమవారం ఉదయం తారకరత్నకు వైద్యులు సిటీ స్కాన్ చేశారు. ఈ రిపోర్టు రావాడానికి ఇంకాస్త సమయం పట్టేలా ఉంది. ఓ వైపు రిపోర్టులో ఏం వస్తుందనే దానిపైనా కుటుంబ సభ్యుల్లో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సాయంత్రంలోపు తారకరత్న హెల్త్ బులెటిన్‌ను ఆస్పత్రి వర్గాలు విడుదల చేయనున్నాయి. రిపోర్టు ఎలా వస్తుందనే దానిపై నందమూరి కుటుంబ సభ్యులు, అభిమానులు వేయికళ్లతో వేచి చూస్తున్నారు. గుండెపోటు వచ్చిన తర్వాత 30 నిమిషాలపాటు మెదడు పనితీరుపై ప్రభావం పడినట్లు వైద్యులు గుర్తించినట్లు ఇదివరకే చెప్పారు. ప్రస్తుతం ఇద్దరు న్యూరో సర్జన్లు సహా 10మంది వైద్యులు తారకరత్న ఆరోగ్యాన్ని నిత్యం పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు.. ఆస్పత్రి వద్ద సందర్శకుల తాకిడి పెరగడంతో బెంగళూరు పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు.

# 3న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం



**(మొదటి పేజి తరువాయి)** ఉన్నాయి. 3న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ప్రారంభించి. ఆరోజు ఉభయ సభలన ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. తరవాత 6న బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. శాసనసభ, శాసన మండలి బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వం షెడ్యూల్ కూడా విడుదల చేశారు. అనూహ్య పరిణామాల నేపథ్యంలో అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీని ప్రభుత్వం మార్చుకుంది. 3వ తేదీకి బదులు 6న బ్జడెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని ప్రభుత్వం వర్గాలు చెబుతున్నాయి. నిజానికి డిసెంబరులో శీతాకాల సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం యోచించింది. కానీ బీఆర్ఎస్‌ను విస్తరించే నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళ్లడంతో సమావేశాలు జరగలేదు. వర్షాకాల సమావేశాలు సెప్టెంబరు 6, 12, 13 తేదీల్లో జరిగాయి. అప్పటి నుంచి ఆరు నెలల్లోపు సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. కాగా, ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టనుంది. అందులో వచ్చే నిధులను పరిశీలించి, రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావించింది. గత బడ్జెట్ సమావేశాలు కూడా గవర్నర్ ప్రసంగం లేకుండానే జరగడంతో రాద్ధాంతంగా మారింది. రాజ్‌భవన్, ముఖ్యమంత్రి కార్యాలయం మధ్య వివాదాన్ని రాజేసింది. ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించాల్సి ఉన్నందున.. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి అనుమతి ఇస్తున్నట్లు అప్పట్లో గవర్నర్ వెల్లడించారు. కానీ అంతకుముందు సమావేశాలకు కొనసాగింపుగానే బడ్జెట్ సమావేశాలను ప్రారంభిస్తు న్నామని, ఈ దృష్ట్యా గవర్నర్ అనుమతి అవసరం లేదని, స్పీకర్ సమావేశాలను ప్రారంభించవచ్చంటూ అప్పట్లో ప్రభుత్వ వర్గాలు వివరణ ఇచ్చాయి. నిజానికి బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ప్రారంభించడం సంప్రదాయం. ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభ్యులు మాట్లాడతారు. ఇలాంటి వ్యవహారం ఏమీ లేకుండానే బడ్జెట్ సమావేశాలను నిర్వహిస్తుండడం సర్వత్రా చర్చనీయంగా మారుతోంది. ఇకపోతే 3 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలంటూ గవర్నర్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. ఇందుకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఆమోదం తెలపాల్సి ఉన్నందున అనుమతి కోరుతూ ఈ నెల 21నే గవర్నర్‌కు లేఖ పంపింది. అయితే గవర్నర్ తమిళిసై మాత్రం అనుమతి తెలపలేదు. రాజ్‌భవన్ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో సోమవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తరపున వాదించేందుకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవేను రంగంలోకి దించింది. ప్రజాపద్దును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు తక్షణమే అనుమతించేలా గవర్నర్‌కు ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరాలనుకున్నారు. కానీ ఉన్నట్లుండి హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. గవర్నర్‌ను విమర్శించొద్దన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని లాయర్ దుష్యంత్ దవే తెలిపారు. గతంలో రెండు సార్లు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కాస్త వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. గవర్నర్ ప్రసంగం లేకుండాబడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని అనుకున్న ప్రభుత్వం మనసు మార్చుకుని.. ఈ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉంటుందని ప్రకటించింది. ఇదే విషయాన్ని ప్రభుత్వ తరపు న్యాయవాది దుష్యంత్ దవే హైకోర్టుకు వెల్లడించారు. దీంతో 3న గవర్నర్ ప్రసంగం ఉంటుంది. రెండు రోజులపాటు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం తరవాత 6న బడ్జెట్ ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు తేదీలను ఖరారు చేయనున్నారు.

# నీటిరంగంలో విప్లవం సాధించాం



**(మొదటి పేజి తరువాయి)** అని వెల్లడించారు. మిషన్ కాకతీయతో 46 వేల చెరువులను బాగుచేశామని, దీంతో వ్యవసాయ స్థిరీకరణ, సాగుపెంపు సాధ్యమైందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులతో సాగువిస్తీర్ణం రెట్టింపయిందని చెప్పారు. అనతి కాలంలోనే మిగులు విద్యుత్ సాధించామన్నారు. రైతులకు 24 గంటల కరెంటు అందిస్తున్నామని చెప్పారు. మెదక్ జిల్లా మనోహరాబాద్‌లో రూ.450 కోట్ల పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఐటీసీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటీసీ అతిపెద్ద పేపర్ మిల్లు తెలంగాణలోనే ఉందన్నారు. తెలంగాణపై ఐటీసీ చైర్మన్ సంజీవ్‌పురి ప్రశంసలు సంతోషం కలిగించాయని చెప్పారు. ఈ ప్లాంటులో గోధుమ పిండి, చిప్స్, బిస్కెట్లు, నూడుల్స్ తయారు చేస్తున్నారని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గొర్రెలు, మేకల సంఖ్య రెట్టింపయిందన్నారు. వచ్చే ఐదేండ్లలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. విదేశాల నుంచి నూనెల దిగుమతిని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఐటీసీకి ఆసక్తి ఉంటే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పెట్టాలని సూచించారు. ములుగు జిల్లా కమలాపురంలో రేయాన్స్ ఫాక్టరీని టేకప్ చేయాలని కోరారు. పరిశ్రమల వల్ల స్థానికులు పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహకారం అందిస్తామన్నారు. ప్రైవేటు రంగంలో వచ్చే పెట్టుబడులకు ప్రజలు సహకారం అందించాలన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఐటీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికంగా వైద్యారోగ్య, విద్యా రంగంలో ఐటీసీ సహకారం అందించాలని, స్థానిక రైతుల నుంచి ముడి పదార్థాలు కొనాలని కోరారు. భూమి కోల్పోయినవారిని ఆదుకునే బాధ్యతపై అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఎంపి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి కూడా పాల్గొన్నారు.

# గవర్నర్ విషయంలో వెనక్కి తగ్గిన ప్రభుత్వం



**(మొదటి పేజి తరువాయి)** చెప్పడంతో అందుకు బెంచ్ అంగీకరించింది. ఈ క్రమంలో బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతోటే మొదలౌతాయని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టులో తెలిపింది. దీనికి సంబంధించి హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. గవర్నర్‌ను విమర్శించవద్దన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రభుత్వం తరపు న్యాయవాది దుష్యంత్ దవే తెలిపారు. హైకోర్టు సూచనతో ప్రభుత్వ న్యాయవాది, గవర్నర్ న్యాయవాది చర్చించుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. కొంతకాలంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరగడంతో గవర్నర్ చర్యలపై ప్రభుత్వం ఏకంగా హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రబడ్జెట్ ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ నుంచి అనుమతి రాకపోవడమే సర్కారు నిర్ణయానికి కారణమైంది. రాష్ట్ర శాసనసభ సమావేశాలు మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానుండగా.. ఫిబ్రవరి 3న బడ్జెట్ ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలపాల్సి ఉన్నందున.. అనుమతి కోరుతూ ఈ నెల 21నే గవర్నర్‌కు లేఖ పంపింది. అయితే గవర్నర్ తమిళిసై మాత్రం ఇప్పటికీ అనుమతి తెలపలేదు. పైగా గవర్నర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ఒక రిటర్న్ కమ్యూనికేషన్ వెళ్లింది. బడ్జెట్ ను శాసనసభలో ప్రవేశపెట్టేముందు గవర్నర్ ప్రసంగం ఉంటుందని, అందుకు సంబంధించిన కాపీ తమకు పంపారా? లేదా? అని గవర్నర్ కార్యాలయం సర్కారును కోరింది. దీనిపై ప్రభుత్వం స్పందించలేదు. దాంతో గవర్నర్ కూడా అనుమతి విషయంలో నిర్ణయం తీసుకోలేదు. మరోవైపు ఫిబ్రవరి 3 సమీపిస్తుండటంతో సర్కారు ఉక్కిరిబిక్కిరి అయ్యింది. చివరికి న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించింది. ఈ మేరకు సోమవారం లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవేను అందుకోసం రంగంలోకి దించింది. ప్రజాపద్దును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు తక్షణమే అనుమతించేలా గవర్నర్‌కు ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరాలని కోర్టు మెట్లెక్కింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 202 ప్రకారం బ్జడెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ ఆమోదం తెలపాల్సివుంటుందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో తామే రాజ్యాంగ ఉల్లంఘన చేస్తూ..గవర్నర్‌ను దోషజగా నిలబెట్టాలనుకోవడం బెడిసి కొట్టేలా ఉందని భావించిన ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ఉంటుంది కనుక సమావేశాల షెడ్యూల్ సవరించాల్సి ఉంటుంది. తొలిరోజు గవర్నర్ ప్రసంగం ఉంటుంది. తరవాతే బడ్జెట్ ప్రసంగం ఉంటుంది.

# జాతిపితకు ఘనంగా నివాళి

**(మొదటి పేజి తరువాయి)** అనుసరించి దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి మనల్ని ప్రేరేపించిన మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయనకు మిలియన్ల నమస్కారాలు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. స్వాతంత్ర్య స్వర్ణయుగంలో స్వచ్ఛత, స్వదేశీ, స్వభాష ఆలోచనలను అవలంబించడమే గాంధీజీకి నిజమైన నివాళి అని కొనియాడారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు ఘనంగా నివాళి అర్పించింది. జాతిపిత వర్ధంతి వేడుకలు దేశవ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆయన సమాధి రాజ్‌ఘాట్ వద్ద ప్రముఖులు నివాళులర్పించారు. గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తెలంగాణలోనూ గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపుఘాట్ వద్ద గాంధీ విగ్రహానికి పలువురు పూలమాల వేసి నివాలులర్పించారు. నగరంలోని బాపు ఘాట్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహాత్ముడి విగ్రహం వద్ద గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మహాత్ముడికి నివాళులర్పించిన వారిలో హోంమంత్రి మహ్మూద్ అలీ, కాంగ్రెస్ అగ్రనేత విహెచ్ తదితరులు ఉన్నారు. శాసనభ ఆవరణలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, ముఠా గోపాల్ నివాళి అర్పించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు కూడా నివాళి అర్పించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వీరంతా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. జాతిపిత మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్య్రం తెచ్చి పెట్టడమే కాకుండా.. ప్రపంచానికే శాంతిదూతగా నిలిచారని తెలంగాణ శాసన సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు.




# పెషావర్‌లో ఆత్మాహుతి దాడి



**(మొదటి పేజి తరువాయి)** గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇక ప్రమాదం జరిగిన సమయంలో మసీదులో 260 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మాహుతి దాడి చేసిన వ్యక్తి ప్రార్థన సమయంలో మసీదులోనే ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ముందుగా తనను తాను పేల్చుకోవడంతోనే.. అక్కడున్న ప్రజలంతా గాయపడ్డారని తెలిపారు. క్షతగాత్రులను పెషావర్‌లోని లేడీ రీడింగ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీస్ లైన్స్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం మసీదులో ప్రార్థనల సమయంలో ఈ పేలుడు సంభవించినట్టు పోలీసులు వెల్లడించారు. ఈ దాడిలో 28 మందికిపైగా మృతి చెందగా.. సుమారు 150 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్యాహ్నం ప్రార్థనల సమయంలో పేలుడు జరిగినట్లు పోలీసులు, స్థానికులు చెబుతున్నారు. మసీదులో ఓ వ్యక్తి తనతంట తాను పేల్చుకున్నట్లు భావిస్తున్నారు. తొలి వరుసలో ఉన్న వ్యక్తి ఆత్మాహుతికి పాల్పడినట్లు అంచనా వేస్తున్నారు. జోర్ ప్రార్థనలు జరుగుతున్న సమయంలో దాడి జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు పేలుడు జరిగిన ప్రదేశాన్ని పోలీసులు సీజ్ చేశారు. కేవలం అంబులెన్స్‌లను మాత్రమే అనుమతిస్తున్నారు. పేలుడు ధాటికి భవనం పూర్తిగా దెబ్బతిందని.. భవనం కొంత భాగం కుప్పకూలిపోగా ఆ శిథిలాల కింద కొందరు చిక్కుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

# కామారెడ్డి మాస్టర్ ప్లాన్ విచారణ 13కు వాయిదా



**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి కేఏ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఫిబ్రవరి 13లోపు ప్రభుత్వం తన నిర్ణయాన్ని చెప్పాలని ఆదేశించింది. రైతులను సంప్రదించకుండానే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారని పాల్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మాస్టర్ ప్లాన్ ను రద్దు చేస్తూ మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నా రు. పిటిషనర్ వాదనలు విన్న న్యాయస్థానం తన నిర్ణయం చెప్పాలని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది.

# భారత్ జోడో యాత్ర లక్ష్యం నెరవేరింది



**(మొదటి పేజి తరువాయి)** 145 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగింది. సుమారు ఐదు నెలలపాటు కొనసాగిన పాదయాత్రలో వివాదాలకు కొదువేం లేదు. చివరికి ఆయన ధరించిన టీ షర్ట్ కూడా వివాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. ముఖ్యంగా రాహుల్ గాంధీ రూ.41వేల విలువచేసే టీ షర్టుపై యాత్ర ఆరంభంలోనే భాజపా తీవ్ర విమర్శలు చేసింది. వీర్ సావర్కర్, కొవిడ్ నిబంధనలు వంటి అంశాలన్నీ చర్చనీయాంశమయ్యాయి. మరోవైపు ఈ పాదయాత్రలో రాహుల్ పెళ్లిపై ఎన్నోసార్లు ప్రశ్నలు సైతం తలెత్తాయి. అన్నిటికీ చాలా సరదాగా సమాధానాలిస్తూ వెళ్లారు. మొత్తానికి రాహుల్ పాదయాత్ర ఆయనకు మంచి మైలైజ్ తెచ్చిపెట్టిందనే చెప్పాలి. ఇకపోతే హిమపాతం కారణంగా శ్రీనగర్ - జమ్మూ జాతీయ రహదారిని మూసివేయగా.. విమాన రాకపోకలకు కూడా అంతరాయం కలిగే అవకాశముంది. ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే రాహుల్ గాంధీ సభకు విపక్ష నేతలు రావడం అసాధ్యంగా కనిపిస్తోంది. పొగమంచు, నిరంతరంగా కురుస్తున్న హిమపాతం కారణంగా శ్రీనగర్‌కు వెళ్లే అన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయని శ్రీనగర్ విమానాశ్రయ డైరెక్టర్ కుల్దీప్ సింగ్ రిషి ట్విట్టర్‌లో తెలిపారు. ప్రతికూల వాతావరణం కారణంగా విస్తారా ఎయిర్‌లైన్స్ ఢిల్లీ నుండి శ్రీనగర్‌కు వెళ్లే రెండు విమానాలు రద్దు చేసింది. జమ్ములో నిర్వహిస్తున్న సభకు కాంగ్రెస్ 21 పార్టీలను ఆహ్వానించినట్టు తెలుస్తోంది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా కొందరు హాజరుకావడం లేదని అధికార వర్గాలు తెలిపాయి. తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీడీపీలు ఈ కార్యక్రమానికి ఇప్పటికే దూరంగా ఉన్నాయి.

# అంతర్జాతీయ క్రికెట్‌కు మురళీ విజయ్ గుడ్‌బై

## కెరీర్‌లో అండగా నిలబడ్డ వారికి థాంక్స్ చెప్పిన క్రికెటర్



**లక్నో, జనవరి 30 (సమ సమాజం):** ఇండియన్ క్రికెటర్ మురళీ విజయ్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతున్నట్లు పేర్కొన్నాడు. 87 మ్యాచ్‌లు ఆడిన అతను 4490 రన్స్ చేశాడు. అత్యధికంగా అతను 61 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. దాంట్లో 3982 రన్స్ స్కోర్ చేశాడు. అతని సగటు 38.29. ఇండియా తరపున మురళీ విజయ్ 17 వన్డేలు, 9 టీ20లు ఆడాడు. ట్విట్టర్ ద్వారా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని విజయ్ వెల్లడించారు. భావోద్వేగమైన ఆ పోస్టులో తన కెరీర్ గురించి చెప్పాడు. 2002 నుంచి 2018 వరకు తన అంతర్జాతీయ కెరీర్ సాగినట్లు పేర్కొన్నాడు. టెస్టుల్లో ఎక్కువ మ్యాచ్‌లకు ఆడాడు. 61 మ్యాచ్‌లు ఆడి 38.29 సగటుతో 3,982 పరుగులు చేశాడు. 17 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌ల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్టు చెబుతూ మురళీ విజయ్ భావోద్వేగ ట్వీట్ చేశాడు. 2002 నుంచి 2018 వరకు సాగిన తన క్రికెట్ ప్రయాణంలో భాగమైన అందరికీ ధన్యావాదాలు తెలిపాడు. ఈ ప్రయాణం గొప్పగా సాగిందని, భారత్‌కు అత్యున్నత స్థాయిలో ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవమని అన్నాడు. తనకు అవకాశాలు కల్పించిన బీసీసీఐ, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ , చెన్నై సూపర్ కింగ్స్, కెమ్‌ప్లాస్ట్ శాన్‌మర్ కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్టు పేర్కొన్నాడు. మీ అందరితో కలిసి ఆడినందుకు గొప్పగా ఉందని, తన కలలు సాకారం చేయడంలో సాయం చేసినందుకు జట్టు సహచరులు, కోచ్‌లు, మెంటార్లు, సపోర్ట్ సిబ్బందికి ధన్యవాదాలు తెలపుకుంటున్నట్టు పేర్కొన్నాడు. క్రికెట్‌లో తాను ఒడిదొడుకులు ఎదుర్కొన్నప్పుడు ఫ్యాన్స్ తనకు అండగా నిలిబడి మద్దతు ఇచ్చారని, వారు తనకు ప్రేరణ ఇచ్చారని అన్నాడు. తన కెరీర్‌లో తనకు అండగా నిలబడి ప్రేమ, మద్దతు అందించిన కుటుంబ సభ్యులు, స్నేహితులకు చివరిగా ధన్యావాదాలు చెప్పాలనుకుంటున్నట్టు పేర్కొన్నాడు. వారు తనకు వెన్నెముకలా నిలిచారని, వారి ప్రేమ, మద్దతు లేకుండా తాను ఏమీ సాధించలేకపోయి ఉండేవాడినని అన్నాడు.

# మహిళా క్రికెటర్లు దేశం గర్వించేలా చేశారు



**న్యూఢిల్లీ, జనవరి 30 (సమ సమాజం):** అండర్ 19 ఉమెన్స్ టీ 20 వరల్డ్ కప్ క్రికెట్ లో క్రీడాకారిణుల విజయం దేశం గర్వించేలా చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ట్వీట్ చేశారు. అండర్ 19 మహిళల టి 20 ప్రపంచ కప్‌ను గెలుచుకున్నందుకు టీమ్ ఇండియాకు అభినందనలు తెలిపారు. ఈ ప్రతిభావంతులైన యువతులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారని ప్రశంసించారు. ఈ ఛాంపియన్‌లు యువతకు, ముఖ్యంగా అమ్మాయి లకు స్ఫూర్తి అని కొనియాడారు. వీరు సాధించిన చారిత్రాత్మక విజయం భారతదేశం గర్వించేలా చేసిందని ట్వీట్ లో పేర్కొన్నారు. అండర్-19 ఉమెన్స్ వరల్డ్ కప్ విజేతగా భారత్ నిలవడంపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. భారత జట్టుకు ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. ప్లేయర్లంతా ఆట బాగా ఆడారని కొనియాడారు. వారి విజయం భావి క్రికెటర్లకు మరింత స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పారు. భవిష్యత్ లో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అండర్-19 ఉమెన్స్ వరల్డ్ కప్ విజేతగా భారత్ అవతరించింది. సౌతాఫ్రికాలో జరుగుతున్న తొలి మహిళల ప్రపంచ కప్ ను టీమిండియా కైవసం చేసుకుంది. ఫైనల్లో ఇంగ్లాండ్ పై 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత భారత బౌలర్ల ధాటికి ఇంగ్లాండ్ కేవలం 68 పరుగులకే ఆలౌట్ కాగా..ఆ తర్వాత 69 పరుగుల టా÷-గ్గ్ం÷ట్ ను భారత్ కేవలం 14 ఓవర్లలోనే ఛేధించింది. అందకుముందు ఐసీసీ అండర్ 19 మహిళల వరల్డ్ కప్ ఫైనల్ లో భారత బౌలర్ల ధాటికి ఇంగ్లండ్ 68 పరుగులకే కుప్పకూలింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భారత్.. అరంభం నుంచే కట్టుదిట్టమైన బంతులు వేసి ఇంగ్లండ్ బ్యాట్స్ మెన్స్ ను బెంబేలెత్తించింది. నియామ్ ఫియోనా హాలండ్ (10), ర్యానా మక్డోనాల్డ్ (19), సోఫియా స్మేల్ (10), అలెక్సా స్టోన్‌హౌస్(11) మినహా మిగితా బ్యాట్స్ మెన్స్ అంతా సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో టిటాస్ సాధు, అర్చన దేవి, పార్షవి చోప్రా తలో రెండు వికెట్లు తీశారు.

# రెండో టీ ట్వంటీలో చెమటోడ్చిన టీమిండియా

## ఒక్కటంటే ఒక్క సిక్స్ కూడా రాబట్టలేని జట్లు



**లక్నో, జనవరి 30 (సమ సమాజం):** లక్నో వేదికగా న్యూజిలాండ్ తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ లో టీమిండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 100 పరుగుల టార్గెతో బరిలోకి దిగిన టీమిండియా 4 వికెట్లను కోల్పోయి మరో బంతి మిగిలుండగానే లక్ష్యాన్ని చేధించింది. అయితే రసవత్తరంగా సాగిన ఈ మ్యాచ్ లో ఒక్కటంటే ఒక్క సిక్స్ పడలేదు. సాధారణంగా టీ 20 మ్యాచ్ అంటేనే సిక్సులు ఫటాఫట్‌గా పడుతుం టాయి. కానీ ఈ మ్యాచ్ లో ఇరు జట్లు ఒక్క సిక్స్ కూడా బాదలేదు. ఇండియాలో జరిగిన టీ20 మ్యాచుల్లో ఇలా జరగడం ఇదే తొలిసారి. ఇక మ్యాచ్ లో మొత్తం 14 ఫోర్లు నమోదయ్యాయి. కివీస్ 6 ఫోర్లు బాదగా, టీమిండియా 8 ఫోర్లు కొట్టింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ సమం చేసిన టీమిండియా అహ్మదాబాద్ వేదికగా ఫిబ్రవరి 1న జరగనున్న చివరి టీ 20 మ్యాచ్ లో కివీస్ తో తలపడనుంది.

# భద్రాద్రి రామబాణం త్రిష

## ప్రశంసలు కురిపించిన రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, జనవరి 30 (సమ సమాజం):** మహిళల అండర్-19 వరల్డ్ కప్ గెలుపులో కీలక పాత్ర పోషించిన భద్రాచలం బిడ్డ గొంగడి త్రిషకు అభినందలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు రాజకీయ నాయకులు త్రిషను అభినందిస్తూ పోస్టులు పెడుతున్నారు. తాజాగా కాంగ్రెస్ తెలంగాణ చీఫ్ రేవంత్ రెడ్డి త్రిషను అభినందిస్తూ ట్వీట్ చేశారు.' మన మట్టిలో పుట్టిన మరో ఆణిముత్యం. విశ్వ క్రీడా వేదికపై భారత కీర్తి పతాకాను ఎగరేసిన భద్రాద్రి రామ బాణం. లక్షలాది యువ తరంగాలకు మరో స్ఫూర్తిగీతం.మహిళల అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్ లో భారత జట్టును విశ్వ విజేతగా నిలిపిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు శుభాభినందనలు‘ అంటూ కొనియాడారు. ఆదివారం జరిగిన అండర్ 19 వరల్డ్ కప్ లో ఇంగ్లాండ్ తో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో 69 పరుగుల టా÷-ర్గెట్ తో బరిలోకి దిగిన టీమిండియా 3 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి కష్టకాలంలో పడింది. అపుడు తెలుగు అమ్మాయి గొంగడి త్రిష 24, సౌమ్య తివారితో( 24)కలిసి చివరి వరకు ఉండి ఇండియాను గెలిపించారు. టోర్నీలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ గెలుచుకుంది.

# స్పోర్ట్స్ అథారిటీలో మంత్రి రోజాకు చోటు



**న్యూఢిల్లీ, జనవరి 30 (సమ సమాజం):** :స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మంత్రి ఆర్కే రోజాకు చోటు లభించింది. ఏపీ క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజాకు స్థానం కల్పిస్తూ జనరల్ బాడీ ఆఫ్ ఇండియా సెక్రెటరీ జతిన్ నర్వాల్ ఆమెకు లేఖ రాశారు. కేంద్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి ప్రెసిడెంట్‌గా కొనసాగే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యవర్గంలో సభ్యులుగా ఏపీ, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిస్సా, త్రిపుర రాష్ట్రాల క్రీడల శాఖ మంత్రులకు కేంద్రం చోటు కల్పించింది.




# 'పుష్ప 2'పై భారీ అంచనాలు

## కథను ఇంట్రెస్టింగ్‌గా మలచే పనిలో సుక్కు



పుష్ప ఘన విజయం తరవాత ఇప్పుడు 'పుష్ప 2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా పై వున్న క్రేజ్ ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు సుకుమార్ ఈ మూవీని అత్యంత భారీ స్తాయిలో ఎవరూ ఊహించని విధంగా తెరపైకి తీసుకొస్తున్నారు. పార్ట్ 1 లో డైలీ కూలీ తన యాటిట్యూడ్ తో తెగింపుతో సిండికేట్ స్మగ్లర్ గా ఎదిగిన క్రమాన్ని చూపించగా.. 'పుష్ప 2'లో మాత్రం ఆ సిండికేట్ ని ఏలే వ్యక్తి వరల్డ్ వైడ్ గా మోస్ట్ వాంటెడ్ రెడ్ సాండల్ సామ్రాజ్యానికి డాన్ గా అవతరించిన క్రమాన్ని దేశ విదేశాల్లో నెట్ వర్క్ ని క్రియేట్ చేసుకున్న క్రమాన్ని చూపించబోతున్నారట. ఇదిలా వుంటే ఇటీవల అదిగో ఇదిగో అంటూ సాగదీస్తున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఇటీవల వైజాగ్ లో మొదలైంది. అక్కడ భారీ స్థాయిలో అల్లు అర్జున్ ఇంట్రడక్షన్ సాంగ్ తెరకెక్కించారట. సినిమాకు ఇది ప్రత్యేక హైలైట్ గా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్. ఇదిలా వుంటే ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ మూవీ గురించి తాజాగా ఓ ఆసక్తికరమైన వార్త హల్ చల్ చేస్తోంది. ఫస్ట్ పార్ట్ ట్రెమండస్ హిట్ గా నిలవడంతో సుకుమార్ పార్ట్ 2 ని ప్రత్యేక హంగులతో ట్విస్ట్ లతో తెరపైకి తీసుకొస్తున్నారట. ఇందులో భాగంగానే ఈ మూవీలోని ఇంటర్వెల్ బ్యాంగ్ అభిమానులతో పాటు ప్రేక్షకులని సర్ ప్రైజ్ చేస్తుందని ఓ వార్త నెట్టింట వైరల్ గా మారింది. విషయం ఏంటంటే సినిమాలో బన్నీ రెడ్ సాండల్ స్లగ్లర్ గా కనిపించనున్న విషయం తెలిసిందే. అయితే కూలి కాస్త సిండికేట్ పగ్గాలని దక్కించుకునే వ్యక్తిగా పార్ట్ 1 లో చూపించిన సుకుమార్ పార్ట్ 2లో మాత్రం బన్నీని రెడ్ సాండల్ స్మగ్లింగ్ ని దేశ విదేశాల్లో విస్తరించే డాన్ గా చూపించబోతున్నాడట. ఇంటర్వెల్ బ్యాంగ్ లో అన్ని ఈ లుక్ లో కనిపించి కేకల్ పెట్టించనున్నాడని ఈ సీన్ సినిమాకు ప్రధాన హైలైట్ గా నిలవనుందని ఇన్ సైడ్ టాక్. అంతే కాకుండా సినిమాలో పార్ట్ 1 కు మించిన స్థాయిలో కొత్త పాత్రలు వుంటాయని ఇవి సినిమాకు హైలైట్ గా నిలుస్తాయని తెలుస్తోంది. ఈ మూవీ విషయంలో సుకుమార్ భారీ ప్లాన్ తో ముందుకు వెళుతున్నాడని సినిమాని ఎవరూ ఊహించని స్టాండర్డ్స్ లో తెరపైకి తీసుకురాబోతున్నాడని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. కీలక పాత్రల్లో ఫహద్ ఫాజిల్ అనసూయ సునీల్ తదితరులు నటిస్తున్నారు. భారీ అంచనాలు నెలకొన్న ఈ మూవీని 2024 జనవరికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారు.



## మార్చిలో పట్టాలకెక్కనున్న మహేశ్, రాజమౌళి కాంబో

'ఆర్ఆర్ఆర్' విడుదలై మార్చి 24వ తేదీకి ఏడాది కావొస్తుంది. ప్యాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ చిత్రం 1200 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అంతే కాదు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా సత్తా చాటింది. జపాన్‌లోనూ ఈ చిత్రం ట్రెండ్ క్రియేట్ చేసింది. పైగా అక్కడ 100 రోజుల మార్క్‌ను దాటింది.. ఇటీవల లాస్ ఏంజెల్స్‌లో గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకుంది. 'నాటు నాటు' పాట ఆస్కార్ నామినేషన్స్ లోనూ చోటు చేసుకుంది. దీంతో చిత్ర బృందం అంతా సెలబ్రేషన్స్‌లో ఉంది. దర్శకుడు రాజమౌళి అయితే ఇప్పటి అవార్డులు, ప్రశంసలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనిని బట్టి చూస్తే రాజమౌళి మరో సినిమాను ట్రాక్ ఎక్కించాలంటే చాలా టైమే పట్టేలా ఉంది. ప్రేక్షకులు మాత్రం ఆయన నుంచి కొత్త చిత్రం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఎదురు చూడడం అంటే సినిమా విడుదల కోసం కాదు... సినిమా ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని. సూపర్‌స్టార్ మహేశ్‌తో రాజమౌళి ఓ సినిమా కమిట్ అయ్యారు. ఆ సినిమా సెట్స్ మీదకెళ్లేది ఎప్పుడా అని అంతా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఓ గుడ్‌న్యూస్ బయటకు వచ్చింది. మహేశ్ - రాజమౌళి కాంబినేషన్‌లో ఈ చిత్రంలో జనవరిలో మొదలు కావాల్సి ఉందని వార్తలొచ్చాయి. అది కుదరకపోవడంతో ఫిబ్రవరిలో పూజా కార్యక్రమాలు మొదలవుతాయనే వార్త ఫిల్మ్‌నగర్‌లో చక్కర్లు కొట్టింది. తాజా సమాచారం ప్రకారం మార్చిలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభించడానికి ముహూర్తం కుదిరిందని చిత్ర బృందం నుంచి సమాచారం. ప్రస్తుతం మహేశ్.. త్రివిక్రమ్ సినిమాతో బిజీగా ఉన్నారు. మార్చి నుంచి రాజమౌళి సినిమా కోసం డేట్లు కేటాయించారని, ప్యారలల్‌గా రెండు సినిమాలకు మహేశ్ షూటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. యాక్షన్ అడ్వెంచర్ డ్రామాగా రూపొందనున్న ఈ చిత్రాన్ని కె.ఎల్ నారాయణ నిర్మించనున్నారు.

## సస్పెన్స్ థ్రిల్లర్‌గా భూతద్దం భాస్కర్ నారాయణ



శివ కందుకూరి టైటిల్ పాత్ర పోషించిన చిత్రం 'భూతద్దం భాస్కర్ నారాయణ'. రాశీ సింగ్ కథానాయిక. పురుషోత్తం రాజ్ దర్శకుడు. స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, కార్తీక్ ముడుంబై నిర్మాతలు. శనివారం హైదరాబాద్‌లో టీజర్ విడుదలైంది. 'పోలీసులకు చుక్కలు చూపించే ఓ సీరియల్ కిల్లర్‌ని పట్టుకోవడానికి డిటెక్టీవ్ భాస్కర్ నారాయణ రంగంలోకి దిగుతాడు. ఆ తరవాత ఏమైందన్నదే కథ. ప్రతీ సన్నివేశం ఉత్కంఠ కలిగిస్తుంది. ఊహకు అందరి కథ, కథనాలతో ప్రేక్షకుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. టీజర్‌తో అంచనాలు రెట్టింపు అయ్యాయి. మార్చి 31న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామని దర్శక నిర్మాతలు తెలిపారు. సంగీతం: శ్రీచరణ్ పాకాల, విజయ్ బుల్గానిన్.

## మైఖేల్ మూవీపై భారీ అంచనాలు




ఈ సారి 'మైఖేల్'తో సందీప్ కిషన్ పాన్ ఇండియా రేంజ్‌లో హిట్టు కొట్టేలా కనిపిస్తున్నాడు. నిన్న మొన్నటి వరకు ఎలాంటి అంచనాలు లేని ఈ సినిమాపై ఇటీవలే రిలీజైన ట్రైలర్ ఎక్కడ లేని బజ్ క్రియేట్ చేసింది. 'విక్రమ్' తరహా కంటెంట్ కనబడటంతో ఎప్పుడెప్పుడు సిని ఈ సారి 'మైఖేల్'తో సందీప్ కిషన్ పాన్ ఇండియా రేంజ్‌లో హిట్టు కొట్టేలా కనిపిస్తున్నాడు. నిన్న మొన్నటి వరకు ఎలాంటి అంచనాలు లేని ఈ సినిమాపై ఇటీవలే రిలీజైన ట్రైలర్ ఎక్కడ లేని బజ్ క్రియేట్ చేసింది. 'విక్రమ్' తరహా కంటెంట్ కనబడటంతో ఎప్పుడెప్పుడు సినిమా చూస్తామా అనే క్యూరియాసిటీ ఆడియెన్స్‌లో నెలకొంది. రంజిత్ జయంకోడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 3న రిలీజ్ కాబోతుంది. ఈ క్రమంలో చిత్రబృందం వరుస ప్రమోషన్‌లో బిజీ బిజీగా గడుపుతున్నారు. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను పెద్ద ఎత్తులో ప్లాన్ చేస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in